క్లుప్తంగా

ఆస్పత్రి పనులు పూర్తి చేయాలి

సీతంపేట: మండల పరిధిలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఈ ఆస్పత్రి నిర్మాణాలను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పనులు త్వరితగతిన పూర్తి కావడంలో స్థానిక ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓ చొరవ చూపాలని పేర్కొన్నారు.

నేటి యోగాంధ్రకు కలెక్టర్..

సీతంపేట: మండల పరిధిలోని అడ్వంచర్‌పార్కులో గురువారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హాజరు కానున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కూలి కోసం వేతనదారుల ఆందోళన



వేతనదారులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కొమరాడ: ఉపాధి హామీ పథకం వేతనదారులకు తొమ్మిది వారాలుగా బిల్లులు చెల్లించకపోవడంతో వారు బుధవారం ఆందోళన చేశారు. సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులకు తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి వేతనదారులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

బియ్యం కావాలంటే మూడు కిలోమీటర్లు రావాల్సిందే..



రేషన్ బియ్యం కోసం కుటుంబంతో సహా వీరఘట్టం వచ్చిన అచ్చెపువలస గ్రామస్తులు

వీరఘట్టం: మండలంలోని అచ్చెపువలస గిరిజన గ్రామ ప్రజలకు రేషన్ కష్టాలు మొదలయ్యాయి. వీరఘట్టం మేజరు పంచాయతీ పరిధిలో ఉన్న ఈ గ్రామం మండల కేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. మొన్నటి వరకు ఎండీయూ ఆపరేటర్లు ఊరిలోకి వచ్చి ఇంటింటికీ బియ్యం అందజేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం బియ్యం పంపిణీ బాధ్యత రేషన్ డీలర్లకు అప్పగించడంతో రేషన్ బియ్యం కోసం ఇంత దూరం రావాల్సి వస్తోందని వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

గరుగుబిల్లి: ఇంటి పన్నుల లక్ష్యాలను అధిగమించాలని పార్వతీపురం డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగభూషణరావు సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో రూ.2.30కోట్లు మేర ఇంటి పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శులకు లక్ష్యాలను విధించామన్నారు. లక్ష్యాలను అధిగమించకపోతే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఇంటి పన్నులకు సంబంధించి సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. మండలానికి సంబంధించి రూ.27.57 లక్షలకుగాను రూ.13.59 లక్షలను వసూలైందన్నారు. మండలంలోని 10,430 గృహాలకుగాను 7,091 గృహాలకు ఆధార్ సీడింగ్ జరిగిందన్నారు. గురువారం నిర్వహించే పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను విరివిగా నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, హోమియో వైద్యాధికారి కె.కాసుల వర్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాల పరిశీలన

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో పలు రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం పరిశీలించారు. ఈ మేరకు సీఎస్‌పీ రోడ్డు – కొత్తవలస, గొయ్యిగూడ – జోగిమానుగూడ, బొంగుడుగూడ – బుగతగూడ, దిగువసంకిలి – ఎగువ సంకిలి రహదారుల కోర్ కటింగ్‌ను చూశారు. కార్యక్రమంలో విజిలెన్స్ బృంద సభ్యులు డీఈ సత్యనారాయణ, ఏఈలు గణేష్, ప్రేమకుమార్, ట్రైబుల్ వెల్ఫేర్ డీఈ సింహాచలం, ఏఈ నాగభూషణరావు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంతో భయాందోళనలు

గరుగుబిల్లి: మండలంలోని తులసిరామినాయుడువలస – దళాయివలస గ్రామాల మధ్య ఏనుగులు బుధవారం సంచరిస్తూ కనిపించాయి. గత పది రోజుల నుంచి మండలంలోని నందివానివలస, సుంకి, సంతోషపురం, గొట్టివలస, తదితర గ్రామాల్లో ఏనుగులు సంచరించాయి. ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏ గ్రామంలో సంచరించి ఎవరికి హాని చేస్తాయోనని, ఏ పంటలను నాశనం చేస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా పక్షాన పోరాడుతాం..

- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి
- టీడీపీ ఏడాది పాలనను నిరసిస్తూ చేపట్టిన 'వెన్నుపోటు దినం'విజయవంతం
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పాలకొండ పట్టణంలో సాగుతున్న నిరసన ర్యాలీ

పాలకొండ/ పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంతవరకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతంగా సాగింది. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ కూడలి నుంచి సాగిన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా వైఎస్సార్ కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిలో సుమారు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగించారు. సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు బాబూ అంటూ నినాదాలు చేశారు. సబ్ కలక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి.. కార్యాలయం ఏఓ అప్పారావుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ.. కూటమి నాయకులు అబద్ధపు మాటలు చెప్పి మోసపూరిత పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజలకు వెన్నుపోటు పొడుస్తూ సూపర్ సిక్స్ హామీలు గాలికి వదిలేశారని ఆరోపించారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



ప్లకార్డులు ప్రదర్శన చేస్తున్న కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ పాలనలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాటాలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళలు, ఉద్యోగులు, వలంటీర్లు, నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు, చివరికి వృద్ధులను సైతం మోసగించిన ఘనత కూటమి ప్రభుత్వం దక్కించుకుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, మండల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వెన్నుపోటు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

జియ్యమ్మవలస (రూరల్): కూటమి పాలనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కురుపాంలో బుధవారం వెన్నుపోటు దినం భారీ ఎత్తున నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ పరిశీలకుడు బోడేడి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల వేళ ఇచ్చిన అన్ని హామీలను తుంగలో తొక్కారన్నారు. ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలను తుంగలో తొక్కారన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు కూటమి పార్టీలకు ఓట్లు వేశారని, తరువాత ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబుకు వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. సొంత మామకే వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. సూపర్ సిక్స్ పేరిట ప్రజలను మోసం చేశారన్నారు. రైతు భరోసా, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం తదితరమైనవి పూర్తిగా విస్మరించారన్నారు. గుమ్మలక్ష్మీపురం ఎంపీపీ దీనమయ్య, కురుపాం మండల కన్వీనర్ గౌరీ శంకర్రావు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ జి.సుజాత, జియ్యమ్మవలస మండలం కోట రమేష్‌నాయుడు, గరుగుబిల్లి మండలం కేతిరెడ్డి అచ్యుతరావు, కొమరాడ మండలం జనార్దనరావుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కురుపాంలోని వైఎస్సార్ విగ్రహం నుంచి పాత బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రవణమ్మకు వినతి పత్రం అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినం విజయవంతం చేశారు.



కురుపాం తహసీల్దార్ రవణమ్మకు వినతిపత్రం అందజేత

టీబీ నివారణే లక్ష్యం కావాలి

గరుగుబిల్లి: క్షయ వ్యాధి (టీబీ) అంతమే లక్ష్యం కావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డా.సంతోష్ కుమార్ సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. సిబ్బందికి, రోగులకు పలు సూచనలు చేశారు. ఇది గాలి ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపించి, సాధారణంగా ఊపిరితిత్తులపై ప్రభావితం చేస్తుందన్నారు. ఆగకుండా దగ్గు వచ్చి ఊపిరి తీసుకొనేందుకు ఇబ్బంది పడితే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు. టీబీ వస్తే ఏ ఒక్కరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా చికిత్స చేయించుకుంటే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



టీబీపై అవగాహన కల్పిస్తున్న డా.సంతోష్‌కుమార్

పక్కాగా ఫీవర్ సర్వే

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టాలని జిల్లా ఉప వైద్య అధికారి డాక్టర్ కెవిఎస్.పద్మావతి అన్నారు. మండలంలోని తాడికొండ పీహెచ్‌సీని ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఓపీ రికార్డు, మందుల రికార్డు, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వేను పక్కాగా చేపట్టి, నివేదికను ఎప్పటికప్పుడు చేరవేయాలని, ప్రతీ నెల మొదటి బుధవారం ప్రతీ గ్రామ సచివాలయం వద్ద ఎనీమియా యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించాలని, గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలంటూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు ఉన్నారు.



తాడికొండలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ పద్మావతి

సాయి భక్తుల భిక్షాటన



అలరించిన శక్తి వేషాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో జరుగుతున్న 23వ వార్షికోత్సవం, 19వ అఖండ సాయి నామ సప్తాహం కార్యక్రమంలో భాగంగా బుధవారం బాబా భక్తులు గ్రామంలోని పలు వీధుల్లో భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శక్తి వేషాలు, తీన్‌మార్ డప్పులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయిసప్తాహం కార్యక్రమంలో కార్యక్రమంలో భాగంగా గత వారం రోజుల నుంచి ఓం సాయి శ్రీసాయి నామసంకీర్తనను విజయవాడ నుంచి వచ్చిన బృందం ఆలపించారు. గురువారం స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, విశేషపూజలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించాలి

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు అవలంభించాలని డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లిలో గల జట్టు ట్రస్టులో మూడు రోజుల జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం చేయటం వల్ల ఏడాది అంతా భూమిని కప్పి వుంచడంవల్ల వేరు వ్యవస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రధాన వ్యవసాయం ముందు నవధాన్యాలను సాగు చేయడంతో భూమికి కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయన్నారు. జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, ఏడీఏ మధుసూధనరావు, వీఏఏలు, వీహెచ్ఏలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాలేసు గ్రామానికి చెందిన తోయక దామి గ్రామ పరిసరాల్లో తోటి కూలీలతో కలిసి బుధవారం ఉదయం ఉపాధి హామీ పథకం పనులు చేస్తుండగా పాముకాటుకు గురైంది. సమాచారం తెలుసుకున్న ఫీల్డ్ అసిస్టెంట్ దాసు ఆమెను వెంటనే రేగిడి పీహెచ్‌సీకి తరలించారు. రేగిడి పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయగా తరలించారు. అక్కడ వైద్యసేవలు అందిస్తున్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామంలో సబ్సిడీపై కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతుల మీదుగా బుధవారం పాడి రైతులకు ఉచితంగా పశువుల దాణా పంపిణీ చేశారు. రూ.1110 విలువ చేసే 50 కిలోల దాణా బస్తా పాడి రైతులకు రూ.555లకు అందజేస్తున్నట్టు పశువైద్యాధికారి ఎస్.మునికుమార్ తెలిపారు. ప్రతి ఒక్క రైతు వీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, పాడి రైతులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో దోమల నివారణ మందు పిచికారీ

- డీఎంఓ సత్యనారాయణ

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల వసతిగృహాల్లో విస్తృతంగా దోమల నివారణా మందు పిచికారీ చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి పీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలకు చెందిన వసతిగృహాల్లో ఐఆర్ఎస్ 5 శాతం ద్రావణాన్ని పిచికారీ చేయడాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న పాఠశాలల పునః ప్రారంభమవుతాయని, ఈ లోగా మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. అనంతరం దోనుబాయి పీహెచ్‌సీని సందర్శించారు. ఓపీ ఎంత వస్తుంది.. మలేరియా పాజిటివ్ కేసులు ఇటీవల ఎన్ని నమోదయ్యాయి.. రక్త పరీక్షలు ఎలా చేస్తున్నదీ ఆరా తీశారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణ మందు స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డీఎంఓ సత్యనారాయణ

రథాలమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో నూతనంగా నిర్మించిన రథాలమ్మ గుడి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బుధవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం పుణ్యాహవచనం, పరిషత్, మండప ఆవాహనం జరిగింది. జల, ధాన్యాది వాసములు మరియు సకల దేవతా హోమములు, మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని కాళీ గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు జరిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

'వెన్నుపోటు దినం'కు తరలిన పార్టీ శ్రేణులు

గరుగుబిల్లి: కూటమి పాలనను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినంకు పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా ప్రజలు కూడా తరలివెళ్లారు. మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు ఆధ్వర్యంలో ఖడ్గవలస జంక్షన్ నుంచి వెన్నుపోటు దినంకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అభిమానులు తరలివెళ్లారు. కురుపాం వరకు బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు. సర్పంచ్ కె.ఇందిర, ఉప సర్పంచ్ టి.ఎల్లంనాయుడు, నాయకులు ఎ.గౌరునాయుడు, ఎం.శీతంనాయుడు, డి.మాధవనాయుడు, బి.దామోదర్, ఎ.వెంకటనాయుడు, ఎం.గౌరునాయుడు, అశోక్ బ్రహ్మ, టి.సింహాచలంనాయుడు, ఎం.వాసునాయుడు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: ఖడ్గవలస జంక్షన్ నుంచి తరలివెళ్తున్న వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

తరలివెళ్లిన నాయకులు

కొమరాడ: వెన్నుపోటు దినం కార్యక్రమానికి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు బుధవారం కురుపాం తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం తక్షణమే హామీలను అమలు చేయాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- డీఎంవో వై.మణి

గుమ్మలక్ష్మీపురం: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం బాగుంటుందని దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారిణి వై.మణి అన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. మండలంలోని పి.ఆమిటి, కేదారిపురం సబ్ సెంటర్ల పరిధిలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారితో మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల అనేక రకాల వ్యాధులు సోకుతాయన్నారు. దోమ తెరలు వాడాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట ఏఎంవో సూర్యనారాయణ, వైద్య సిబ్బంది ఉన్నారు.



కేదారిపురంలో దోమ తెరల ఉపయోగాన్ని వివరిస్తున్న డీఎంవో వై.మణి

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

భామిని: భామిని ఫీడర్ పరిధిలో కొరమ నుంచి బత్తిలి వరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జలవనరుల శాఖాధికారుల తీరు సరికాదు

- ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

పాలకొండ: స్థానిక జలవనరుల శాఖాధికారుల తీరు సక్రమంగా లేదని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి ఆరోపించారు. బుధవారం స్థానిక సబ్ కలక్టర్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతు సంఘాల ప్రతినిధులతో కాలువల సమస్యపై సమావేశం నిర్వహిస్తామని చెప్పి జలవనరుల శాఖాధికారులే సమావేశానికి పిలిచారని తెలిపారు. సబ్ కలక్టర్‌తో పాటు రైతు సంఘల ప్రతినిధులందరూ సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరకున్నా.. వారు మాత్రం రాలేదని మండిపడ్డారు. సమావేశానికి పిలిచిన అధికారులే రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కండాపు ప్రసాదరావు, కారెపు చిట్టిబాబు, దావాల రమణారావు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణమూర్తి, తదితరులు

పచ్చదనమే లక్ష్యం కావాలి

గరుగుబిల్లి: పర్యావరణాన్ని పచ్చదనంతో నింపడమే లక్ష్యం కావాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు అన్నారు. మండల పరిషత్‌కార్యాలయంలో వనం – మనం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5న నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటి పర్యావరణం పరిరక్షించాలన్నారు. మొక్కల నాటడం, సంరక్షణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో వుంచుకొని మొక్కల పెంపకంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటిని సంరక్షించేందుకు సోక్ పిట్స్‌ను నిర్మాణం చేయాలన్నారు. పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఎన్‌జీవోలను, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో గోపాలరావు

నాలుగో రోజూ అవే కష్టాలు..

గిరిజన ప్రాంతాలకు చెందిన కార్డుదారులు అష్టకష్టాలు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పొల్లలోని డీఆర్ డిపోలకు వచ్చిన లబ్ధిదారులు బుధవారం గంటలకొద్దీ నిరీక్షించారు. సర్వర్ పనిచేయక పోవడంతో రోజంతా సరుకుల కోసం కేటాయించాల్సి వచ్చిందని లబ్ధిదారులు వాపోయారు.

– సీతంపేట



సెంటర్ లైటింగ్‌కు మరమ్మతులు ..



సీతంపేట మెయిన్‌రోడ్డులో ఉన్న సెంటర్ లైటింగ్‌కు బుధవారం మరమ్మతులు చేపట్టారు. తరుచూ ఇవి రిపేర్లకు గురికావడంతో స్పందించిన అధికారులు తక్షణ మరమ్మతులకు ఉపక్రమించారు. గ్రామ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

– సీతంపేట